క్లుప్తంగా

యోగాతో మానసిక, శారీరక సమతుల్యత



ఇబ్రహీంపట్నం: నిత్య యోగా సాధన ద్వారా శారీక, మానసిక సమతుల్యతకు దోహదపడుతుందని ప్రముఖ యోగా గురువు లంకే జనార్దన్ తెలిపారు. స్థానిక ఎస్వీసీటీ కల్యాణ మండపంలో శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. క్రమం తప్పని యోగాతో మెరుగైన ఆరోగ్యం పొందొచ్చన్నారు. సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం సాధన చేయించారు. తొలుత ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేష్‌బాబు జ్యోతి వెలిగించి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఏఈఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పరిసరాల శుభ్రత



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో శనివారం పరిసరాలను శుభ్రం చేశారు. బాలికలకు చెందిన కే2 హాస్టల్ భవనం చుట్టుపక్కల దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే చుట్టూ శుభ్రంగా ఊడ్చారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు, వర్షపు నీరు ప్రవహించేలా మార్గం సుగమం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జాజుల మధు, యూనిట్–4 ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణి పర్యవేక్షిస్తూ ట్రిపుల్ ఐటీ ఆవరణలోని పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వలంటీర్లను డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ అభినందించారు.

డ్రెయినేజీ కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరుకు వినతి



రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలో డ్రెయినేజీ కాల్వలు నిర్మించడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ రాయనపాడు గ్రామ సర్పంచ్ కాటంనేని కళ్యాణి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేశారు. మంత్రి నిర్మలా సీతారామన్ రాయనపాడు గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం వచ్చారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ముసునూరు: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర అంటువ్యాధుల నివారణ, రాష్ట్రీయ బాలల ఆరోగ్య సంరక్షణ జిల్లా ప్రాజెక్టు అధికారి నరేంద్ర కృష్ణ సూచించారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో బీసీ బాలుర, ఎస్సీ బాలికల హాస్టల్స్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు పోషకాహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

క్రీడా ఆణిముత్యాలను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: క్రీడలను ప్రోత్సహించడంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా సంబరానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలం, పట్టణంలోని గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను శనివారం క్రీడాకారులకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏళ్లు వయస్సు పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర పోటీలను గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి మూడో తేదీ వరకు నిర్వహించనున్న క్రీడా సంబరంలో క్రీడాకారులు పాల్గొనాలన్నారు. క్రీడల్లో గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.35 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు ప్రథమ బహుమతి కింద ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఆడేందుకు అవసరమైన అన్ని క్రీడా పరికరాలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. క్రీడల్లో ప్రతిభ ఉన్నవారిని వెలికితీయడం ద్వారా వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లవచ్చనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పట్టణ పరిధిలో బ్యాడ్మింటన్ బ్యాట్‌లు 96, షటిల్ బ్యాట్‌లు 48, బ్యాడ్మింటన్ నెట్‌లు 16, వాలీబాల్‌లు 48, వాలీబాల్ నెట్‌లు 32, క్రికెట్ కిట్‌లు (పురుషులు) 32, క్రికెట్ కిట్ (మహిళలు) 16, టెన్నికాయిట్ రింగ్‌లు 32 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, నాయకులు రాంబాబు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ రైతాంగాన్ని ఆదుకోవాలని వినతి



వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రాయనపాడు(విజయవాడరూరల్): ఏపీ రైతులను మరింత ఆదుకోవాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కోరారు. ఏపీలో మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టం తీవ్రంగా జరిగిందన్నారు. రాయనపాడు గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం మరింత సాయాన్ని ప్రత్యేకంగా విడుదల చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

జనం మెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జనం మెచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని 8వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ, ఎస్టీలకు ప్రభుత్వం అన్ని పదవుల్లో ప్రాధాన్యతనిచ్చి వారికి గుర్తింపునిస్తోందన్నారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. మాజీ సీఎం చంద్రబాబుకు ఏనాడు రాష్ట్ర ప్రయోజనాలు గాని, ప్రజల సంక్షేమం గాని పట్టలేదన్నారు. సంపదనంతా దోచుకునేందుకే అధికారం కోసం పాకులాడుతున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వార్డు నాయకుడు యార్లగడ్డ చంటి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, 10వ వార్డు కౌన్సిలర్ మీర్ అంజాద్ ఆలీ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



నూజివీడులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు



మైలవరంలో జరిగిన లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి శైలజ, న్యాయవాదులు

నూజివీడు: రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా తమ కేసులను రాజీ మార్గంలో త్వరితగతిన పరిష్కరించుకునేందుకే లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో శనివారం మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పునకు అప్పీలు ఉండదని, సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌ల ద్వారా కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 591 కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాది కేవీకే విక్రమ్‌కుమార్, కేజే డిక్సన్ పాల్గొన్నారు.

రాజీ పడి కేసులు పరిష్కరించుకోండి

మైలవరం: రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులు పరిష్కారం చేసుకుని తమ విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. శైలజ తెలిపారు. మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పావులూరి పద్మశ్రీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ స్టాఫ్, ఉద్యోగస్తులతో లోక్ అదాలత్ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చేసుకున్నారు. మైలవరం లోక్ అదాలత్‌లో 688 కేసులు పరిష్కారం అయ్యాయని, తద్వారా రూ.3,55,999 కోర్టుకు జమ అయినట్లు జడ్జి తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, న్యాయవాదులు వీటీ కిశోర్, మాదు ఆంజనేయులు, ఓర్సు శ్రీనివాసరావు, ముల్లంగి రవికుమార్, ఎం. శరత్‌బాబు, ప్రభుత్వ న్యాయవాది పజ్జూరు వెంకట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

తిరువూరు: క్షణికావేశంలో కేసుల్లో ఇరుక్కున్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. రాజీ చేసుకోదగిన కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని జడ్జి తెలిపారు. కోర్టు వివాదాలతో సమయం, డబ్బు వృథా అవుతుందని, రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు. 21 సివిల్ కేసులు, 755 క్రిమినల్ కేసులను అదాలత్‌లో పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, ఏపీపీ బడేమియా, ఏజీపీ రాము, ఏసీపీ రమేష్, న్యాయవాదులు అదాలత్‌లో పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: నూజివీడు న్యాయస్థానం వద్ద శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మండలంలోని 202 కేసులు పరిష్కరించినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడిన 42 మంది వ్యక్తుల దగ్గర నుంచి రూ.12,600, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురు వ్యక్తుల నుంచి రూ.70 వేలు, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ మద్యపానం తాగిన 110 మంది నుంచి రూ.35,500, రాష్ డ్రైవింగ్ చేసిన 13 మంది వ్యక్తులకు రూ.3,900 జరిమానాగా విధించినట్లు పేర్కొన్నారు. వీటితోపాటు లోక్ అదాలత్ ద్వారా మరో 20 కేసులు రాజీ కుదుర్చుకున్నారని ఎస్సై తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ఆగిరిపల్లి: మండలంలో ఇప్పటికే ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకరరావు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా ఈదర గ్రామంలో జగనన్న కాలనీలోని నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బేసిమెంటు లెవెల్ నుంచి రూఫ్ లెవల్ వరకు ఉన్న గృహాల నిర్మాణాన్ని జనవరిలోగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అలీముల్లా, ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



కలగర (విస్సన్నపేట): మండలంలోని కలగర పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన దార్ల జగన్నాథరావు ఇటీవల మరణించాడు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంకింద వైఎస్సార్ బీమా పథకం నుంచి రూ.10 వేలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, వైద్య రంగాల్లో ఐఓటీ కీలక పాత్ర



మాట్లాడుతున్న శ్రీసాయి సతీష్

మైలవరం: నేటి వ్యవసాయం, వైద్య రంగాల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), మెషీన్ లెర్నింగ్ అనేవి కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇండియన్ సర్వర్స్ సీఈఓ శ్రీసాయి సతీష్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్ అనే అంశాలపై గత ఐదు రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శ్రీసాయి సతీష్ మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్ రెండింటి అనుసంధానంతో ప్రాజెక్టులలో పరిశోధనలు చేసి, ఆయా రంగాల అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమానికి డాక్టర్ కే ఫణీంద్ర, ఎం. రాజేష్‌రెడ్డి, ఎం.విజయ్ కుమార్, ఎస్.జ్యోతి కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బీ శ్రీనివాసరావు, సీఎస్ఐ–ఎల్‌బీఆర్‌సీఈ కౌన్సిలర్ డాక్టర్ డాక్టర్ నాగాంజనేయులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తున్న వారిపై కేసు నమోదు

ముసునూరు: వేధింపులకు గురిచేస్తున్న ఓ తల్లీ, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని గోపవరం శివారు వెంకటాపురానికి చెందిన కోట మురళీకృష్ణ పొగాకు చేనును గత ఏడాది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత నెల అతడికే చెందిన మొక్కజొన్న చేనులోని 40 రోజుల మొక్కలను పీకివేశారు. దీనిపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా, అనుమానితుడిగా పేర్కొన్న కోట నాగేంద్రకుమార్‌ను పిలిపించి అడిగారు. దీంతో పగ పెంచుకున్న నాగేంద్రకుమార్, తన తల్లి పార్వతితో కలసి బాధిత కుటుంబంపై వేధింపులకు దిగడం ఆరంభించారు. తరచూ బాధిత కుటుంబ సభ్యులపై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో బాధితుడు మురళీకృష్ణ తిరిగి పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం

దుర్గగుడి ఈఓ రామారావు



యాగశాల వద్ద ఉభయదాతల వివరాలను పరిశీలిస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించాలని దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై ప్రసాదం కౌంటర్లు, మల్లేశ్వరాలయ పనులను ఈఓ రామారావు శనివారం పరిశీలించారు. తొలుత సర్వ దర్శనం, రూ.100, రూ.300 క్యూలను పరిశీలించారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా క్యూలను ముందుకు నడపాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నటరాజస్వామి ఆలయం సమీపంలోని ప్రసాదం కౌంటర్లను తనిఖీ చేసిన ఈఓ భక్తులతో మాట్లాడారు. ప్రసాదం త్వరితగతిన భక్తులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టే కౌంటర్‌లో ఈఓ భక్తులతో మాట్లాడారు. కొబ్బరికాయలు తమ చేతుల్లో నుంచి తీసుకుని సిబ్బందే పగలగొడుతున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. యాగశాలలోని చండీ హోమంలో ఉభయదాతల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయం చుట్టూ రాతి మండపం పనులు త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

మైలవరం: కార్తిక మాసం పురస్కరించుకుని ఆఖరి ఆదివారం కావడంతో ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో మైలవరం కోట వెనుక కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బండి సత్యనారాయణ, నాగులూరి దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో 50 మంది దంపతులు పాల్గొంటారన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

చాట్రాయి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని, మండల ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఎన్‌డీ మిల్టన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించాలని ప్రతి ఆర్‌బీకేలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. మండలంలో ఇప్పటివరకు 1655.56 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




ఆయుష్మాన్ భారత్ కార్డులు అందస్తేన్న ఎంపీడీఓ, సర్పంచ్

కొండపర్వ(విస్సన్నపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మండలంలోని కొండపర్వ, కలగర గ్రామ సచివాలయాల వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల పథకంలో మంజూరైన గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. కొండపర్వ సర్పంచ్ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 12 మేకల మృతి

ఏ.కొండూరు: వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొని మేకలు మృత్యువాత పడిన ఘటన తిరువూరు–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని మత్రియ తండాకు చెందిన భూక్యా చందు మేకలు పెంచుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఉదయాన్నే వాటిని అడవికి వెళ్లి మేపుకొని తిరిగి ఇంటికి వస్తుండగా తండా సమీపంలోకి రాగానే తిరువూరు వైపు వెళుతున్న టిప్పర్ అతివేగంగా వస్తూ మేకలను ఢీకొంది. ఘటనలో 12 మేకలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్ స్వరఝరి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసుడు కొరిడే సుధీర్‌శర్మ పలు వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్.జనార్దన్, మృదంగంపై బీఎస్ ప్రశాంత్, కంజీరాపై శ్రీకాంత్ సహకరించారు. సుధీర్‌శర్మ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాల్సిన అవసముందన్నారు. స్వరఝరి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వాహకులు సుధీర్‌శర్మను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుంది



మాట్లాడుతున్న అకాడమీ సభ్యుడు ప్రసేన్ వేదికమీద కవి ఖాదర్‌మొహిద్దీన్

విజయవాడ కల్చరల్: సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కవిసంధి వినూత్న సాహిత్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కవులు సాహిత్యంతో పరిచయం చేసుకోవాలని ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలని సూచించారు. పుట్టమచ్చ కవి ఖాదర్ మొహిద్దీన్ గురించి మాట్లాడుతూ సమకాలీనమైన అంశాలు ఆయన కవిత్వంలో కనిపిస్తాయని చెప్పారు. కవి ఖాదర్‌మొహిద్దీన్ తాను రచించిన పుట్టమచ్చ కవితా సంపుటిలోని కవిత్వాన్ని వినిపించారు. నేడు కవిత్వంలో వస్తున్న మార్పులు, వస్తువు, రచనా సంవిధానం అంశంగా కవులు ఆయనతో ముఖాముఖి చర్చించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కవులు కవిసంధి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

చాట్రాయి: మిచాంగ్ తుపాను వలన పశు వైద్యశిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని పశు వైద్యాధికారి శివ నాగేంద్రబాబు తెలిపారు. మండలంలోని చీపురుగూడెంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులకు సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు.